ప్రభుత్వ రుణంపై వడ్డీ దేనిలో భాగం?

ప్రపంచంలో ఆయా దేశాల ఆర్థికాభివృద్ధిని అంచనా వేయడానికి జాతీయాదాయం ముఖ్యమైన సాధనంగా ఉపయోగపడుతుంది. ఒక సంవత్సరంలో ఉత్పత్తి అయిన వస్తుసేవల మొత్తం ఉత్పత్తిని ద్రవ్య రూపంలో మదింపు చేస్తే వచ్చే విలువనే ఆ దేశ జాతీయాదాయంగా భావించవచ్చు.

మన దేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం జాతీయాదాయాన్ని అంచనా వేయడానికి ఒక ప్రత్యేక వ్యవస్థంటూ లేదు. దాదాబాయ్ నౌరోజీ, విలియం డిగ్బీ, ఫిండ్లే షిర్రాస్, షా, ఖయ్‌బట్టా, వి.కె.ఆర్.వి.రావ్, ఆర్.సి. దేశాయ్ వంటి నిపుణులు వ్యక్తిగతంగా జాతీయాదాయ అంచనాలను రూపొందించారు. అయితే వీరు సమష్టిగా పనిచేయకపోవడం వల్ల దేశంలోని అధిక ప్రాంతాలకు సంబంధించిన ఆదాయ వనరుల సమాచారాన్ని సేకరించ లేకపోయారు. అంచనాలు వేయడంలో కూడా ఎటువంటి శాస్త్రీయ పద్ధతులను అనుసరించకుండా.. వీరిలో ఎక్కువ మంది వ్యవసాయ రంగంలోని ఉత్పత్తి విలువను అంచనా వేసి దానిలో కొంత శాతాన్ని వ్యవసాయేతర ఆదాయంగా ఊహించారు. దాని ఆధారంగానే జాతీయాదాయాన్ని అంచనా వేశారు. వీరందరిలో వి.కె.ఆర్.వి.రావ్ రూపొందించిన జాతీయాదాయ అంచనాలను కొంతవరకు శాస్త్ర సమ్మతమైనవిగా భావించవచ్చు. ఆయన ఉత్పత్తి, ఆదాయ మదింపు పద్ధతుల సమ్మేళనాన్ని ఉపయోగించి జాతీయాదాయాన్ని లెక్కించారు.

స్వాతంత్ర్యానంతరం దేశంలో జాతీయాదాయ అంచనాలను రూపొందించడానికి 1949లో ప్రముఖ ఆర్థిక వేత్త ప్రశాంత చంద్ర మహలోనోబిస్ అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వం జాతీయాదాయ సంఘాన్ని నియమించింది.

ఈ సంఘం సమర్పించిన నివేదిక ముఖ్యాంశాలు:

- 1950-51లో జాతీయాదాయంలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల వాటా 50 శాతం.
- జాతీయాదాయంలో ద్వితీయ రంగం 1/6వంతు వాటాను కలిగి ఉంది.
- జాతీయాదాయంలో తృతీయ రంగం 1/6 వంతు కంటే కొంత ఎక్కువ భాగాన్ని కలిగి ఉంది.
- జాతీయాదాయంలో వస్తు ఉత్పత్తి వాటా 2/3 వంతు.
- జాతీయాదాయంలో సేవలు 1/3 వంతు వాటాను కలిగి ఉన్నాయి.

ప్రణాళికాయుగంలో దేశంలో జరిగిన ఆర్థికాభివృద్ధిని తెలుసుకోవాలంటే జాతీయ, తలసరి ఆదాయ అంచనాలతోపాటు ఈ రెండు సూచికలలో సాధించిన వృద్ధిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. జాతీయాదాయ అంచనాలను రూపొందించడానికి కేంద్రప్రభుత్వం 1950లో కేంద్ర గణాంక సంస్థను ఏర్పాటు చేసింది. ఈ సంస్థ 1955 నుంచి తన కార్యకలాపాలను ప్రారంభించింది. స్థిర, ప్రస్తుత ధరల



ఆధారంగా కేంద్రగణాంక సంస్థ జాతీయాదాయ అంచనాలను రూపొందిస్తుంది.

జాతీయాదాయంలోని వివిధ రంగాల వాటా జాతీయాదాయ సంయోజనాన్ని సూచిస్తాయి. జాతీయాదాయంలో ఆయారంగాల వాటాను పరిశీలిస్తే.. ప్రాధాన్యత తెలుస్తుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఉత్పత్తి, ఆదాయ మదింపు పద్ధతుల ద్వారా జాతీయాదాయాన్ని లెక్కిస్తుండగా.. అభివృద్ధి చెందిన దేశాల్లో మాత్రం ఆదాయ, వ్యయ మదింపు పద్ధతులను ఉపయోగిస్తున్నారు. 1950-51లో జాతీయాదాయంలో వ్యవసాయ రంగం వాటా ఎక్కువగా ఉంది. కానీ తర్వాతి కాలంలో వ్యవసాయ రంగ వాటా తగ్గుతూ పారిశ్రామిక, సేవా రంగాల వాటా పెరిగింది. ప్రస్తుతం సేవారంగం నుంచే దేశ జాతీయాదాయానికి ఎక్కువ వాటా సమకూరుతోంది. ఈ రంగానికి సంబంధించి ఫైనాన్స్, ఇన్సూరెన్స్, రియల్ ఎస్టేట్, వాణిజ్యం, హోటల్, రవాణా, కమ్యూనికేషన్ రంగాలు అధిక వృద్ధి రేటు నమోదు చేసుకున్నాయి.

జాతీయాదాయ వృద్ధి ధోరణి

గత ఆరు దశాబ్దాలుగా జాతీయాదాయ ధోరణులు, జాతీయోత్పత్తి నిర్మాణతలో మార్పు పరిశీలిస్తే.. ప్రణాళికలు తమ నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో ఎంతవరకు విజయం సాధించాయో తెలుసుకోవచ్చు. స్థిర ధరల వద్ద లెక్కించిన తలసరి ఆదాయాన్ని ప్రజల జీవన ప్రమాణానికి సూచికగా పరిగణించవచ్చు. అదేవిధంగా స్థిర ధరల వద్ద లెక్కించిన నికర జాతీయోత్పత్తి వృద్ధి వస్తు, సేవల వృద్ధితోపాటు ఆర్థిక వ్యవస్థ ఉత్పాదకతను సూచిస్తుంది.

2009-10 జాతీయాదాయానికి సంబంధించి సవరించిన అంశాలు

- 2004-05 ధరల వద్ద ఉత్పత్తి కారకాల ధరల దృష్ట్యా జీడీపీని 2009-10లో రూ.44, 64, 081 కోట్లుగా అంచనా వేశారు.
- 2009-10లో వ్యవసాయం, అడవులు, చేపల పెంపకం రంగాల్లో వృద్ధిని 0.2 శాతంగా అంచనా వేశారు.

- పారిశ్రామిక ఉత్పత్తి సూచీ-మైనింగ్‌లో అంచనా వృద్ధి రేటు 9.7 శాతం.
- పారిశ్రామిక ఉత్పత్తి సూచీ-తయారీ రంగం అంచనా వృద్ధి 10.9 శాతం.
- సవరించిన అంచనా ప్రకారం కమ్యూనిటీ, సాంఘిక, వ్యక్తిగత సేవల వృద్ధి 5.6 శాతం
- 2004-05 ధరల వద్ద 2009-10లో ఉత్పత్తి కారకాల ధరల దృష్ట్యా స్థూల జాతీయోత్పత్తి రూ.44,39,072 కోట్లు.
- 2004-05 ధరల వద్ద 2009-10లో తలసరి నికర జాతీయాదాయం రూ.33,588.
- 2009-10లో జీడీపీ(ఫ్యాక్టర్ కాస్ట్) వృద్ధి 7.4 శాతం.
- 2009-10లో సవరించిన అంచనాల ప్రకారం స్థిర ధరల వద్ద జీడీపీ (ఫ్యాక్టర్ కాస్ట్)లో ప్రాథమిక రంగం వాటా 17.04 శాతం. ద్వితీయ రంగం వాటా 26.02 శాతం. తృతీయ రంగం వాటా 56.94 శాతం.

జాతీయాదాయ పంపిణీ

దేశంలో జాతీయాదాయ పంపిణీని పరిశీలిస్తే.. అసమానతలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. తద్వారా ప్రజల ఆదాయ, సంపదల మధ్య వ్యత్యాసాలు గణనీయంగా పెరిగాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వ్యత్యాసాలు కూడా అధికంగా ఉన్నాయి. గతంతో పోల్చినప్పుడు 2009-10లో వృద్ధి రేటులో తగ్గుదలతోపాటు ఆహార ద్రవ్యోల్బణం (ఫుడ్ ఇన్‌ఫ్లేషన్) రెండంకెలకు చేరింది. అదే సయమంలో దేశంలో అధిక నికరసంపద కలిగిన వ్యక్తుల సంఖ్య 2008 లో 84,000 కాగా 2009-10లో ఇది 1,20,000కు చేరుకుంది. మొత్తం దేశ జనాభాలో వీరి వాటా 0.01 శాతం మాత్రమే. కానీ వీరి మొత్తం సంపద దేశ స్థూల జాతీయాదాయంలో 1/3వంతుకు చేరింది. 2009 ఆసియా-ఫసిఫిక్ వెల్త్ రిపోర్ట్ ప్రకారం దేశంలో అత్యంత నికర సంపద కలిగిన వ్యక్తుల నికర సంపద విలువ 310 బిలియన్ డాలర్లు. సంపద కొద్ది మంది వ్యక్తుల చేతుల్లోనే కేంద్రీకృతం కావడం వల్ల ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతుంది. తద్వారా సమిష్టి డిమాండ్ తగ్గుతుంది. దీని ప్రభావం జాతీయోత్పత్తిపై ప్రతికూలంగా ఉంటుంది. దాంతో జాతీయాదాయం, తలసరి ఆదాయాలు ప్రజల జీవన ప్రమాణం కుంటుపడుతుంది.

నమూనా ప్రశ్నలు

1. దాదాబాయ్ నౌరోజీ మొదటిసారి ఏ సంవత్సరంలో జాతీయాదాయ అంచనా లను చేపట్టారు?
   ఎ) 1867 బి) 1868
   సి) 1870 డి) 1875
2. హిందు రేటు అనే భావన ఎవరితో ముడిపడి ఉంది?
   ఎ) షిర్రాస్ బి) నౌరోజీ
   సి) రాజ్‌కృష్ణ డి) వి.కె.ఆర్.వి.రావ్
3. ఏ పద్ధతిని ఉపయోగించి వి.కె.ఆర్.వి. రావ్ జాతీయాదాయ అంచనాలను రూపొందించారు?
   ఎ) ఉత్పత్తి మదింపు బి) ఆదాయ మదింపు
   సి)వ్యయాల మదింపు
   డి)ఉత్పత్తి, ఆదాయ మదింపు పద్ధతుల సమ్మేళనం
4. ఒక దేశంలో నిజ నికర జాతీయోత్పత్తిలో దీర్ఘకాలంలో సాధించే వృద్ధి విధి విధానాన్ని అభివృద్ధి అని చెప్పింది?
   ఎ) వాడియా, జోషి బి) మన్మోహన్ సింగ్
   సి) మేయర్, బాల్టువిన్ డి) వై.వి. రెడ్డి
5. జాతీయాదాయంలో ప్రస్తుతం ఏ రంగం నుంచి అత్యధిక వాటా లభిస్తోంది?
   ఎ) వ్యవసాయ రంగం బి) పరిశ్రమల రంగం
   సి) సేవాల రంగం డి) పైవేవీకావు
6. 1949జాతీయాదాయ కమిటీ అధ్యక్షుడు?
   ఎ) వి.కె.ఆర్.వి.రావు బి) మహలోనోబిస్
   సి) గాడ్గిల్ డి) కె.ఎన్.రాజ్
7. కింది వాటిలో జాతీయాదాయ మదింపు పద్ధతి కానిది?
   ఎ) ఉత్పత్తి మదింపు పద్ధతి బి) ఆదాయ మదింపు పద్ధతి
   సి) వినియోగ పద్ధతి డి) వ్యయాల మదింపు పద్ధతి
8. ఒక దేశ ఆర్థికాభివృద్ధి కొలవడానికి సరైన ఆధారం?
   ఎ) స్థూల దేశీయోత్పత్తి బి) నికరజాతీయాదాయం
   సి) వ్యష్టి ఆదాయం డి) స్థూల జాతీయోత్పత్తి
9. కింది వాటిలో జాతీయోత్పత్తి ఆదాయాన్ని వాస్తవంగా తెలిపేది?
   ఎ) ఉత్పత్తి కారకాల ధరల దృష్ట్యా నికర జాతీయోత్పత్తి
   బి) మార్కెట్ ధరలలో నికర జాతీయోత్పత్తి
   సి) మార్కెట్ ధరలలో స్థూల జాతీయోత్పత్తి
   డి)ఉత్పత్తి కారకాల ధరల దృష్ట్యా స్థూల జాతీయోత్పత్తి
10. 2004-05 ధరల వద్ద 2009-10లో ఉత్పత్తి కారకాల ధరల దృష్ట్యా నికర జాతీయాదాయం?
    ఎ) రూ. 39,29,000 కోట్లు బి) రూ. 39,29,853 కోట్లు
    సి) రూ. 39,29,900 కోట్లు డి) రూ. 39,29,950 కోట్లు
11. గత సంవత్సరంతో పోల్చినప్పుడు 2009 -10వ సంవత్సరంలో ఏ రంగంలో వృద్ధి రేటు ఎక్కువ?
    ఎ) వ్యవసాయం, అడవులు బి) నిర్మాణ రంగం
    సి) తయారీ రంగం డి) మైనింగ్, క్వారీయింగ్
12. 2009-10లో మార్కెట్ ధరల వద్ద జీడీపీలో ప్రైవేట్ వినియోగ వ్యయం?
    ఎ) 57.3 శాతం బి) 57.5 శాతం
    సి) 57.8 శాతం డి) 57.9 శాతం
13. దేశంలో జాతీయాదాయ గణాంకాలు ఏ ధరలలో లభ్యమవుతున్నాయి?
    ఎ) స్థిర ధరల వద్ద బి) ప్రస్తుత ధరల వద్ద
    సి)ఆధార సంవత్సర ధరల వద్ద డి) స్థిర, ప్రస్తుత ధరల వద్ద
14. ప్రభుత్వ రుణంపై వడ్డీ దేనిలో భాగంగా ఉంటుంది?

ఎ) ప్రభుత్వ బదిలీ చెల్లింపులో బి) సంస్థల బదిలీ చెల్లింపులో

సి) జాతీయాదాయం

డి) కుటుంబరంగం వడ్డీ చెల్లింపులు

15.వ్యయార్హ ఆదాయం కింది వాటిలో దేనికి సమానం?

ఎ) వినియోగం–పొదుపు బి) వినియోగం+పొదుపు

సి) వ్యష్టి ఆదాయం+పన్నులు డి) పైవేవీకావు

16.ఉత్పత్తి కారకాల ధరల దృష్ట్యా స్థూల జాతీయోత్పత్తిని ఎలా లెక్కిస్తారు?

ఎ) మార్కెట్ ధరల వద్ద జీఎన్‌పీ–పరోక్ష పన్నులు+ సబ్సిడీలు

బి) మార్కెట్ ధరల వద్ద జీఎన్‌పీ+పరోక్ష పన్నులు+ సబ్సిడీలు

సి) మార్కెట్ ధరల వద్ద జీఎన్‌పీ–తరుగుదల

డి) మార్కెట్ ధరల వద్ద జీఎన్‌పీ+ తరుగుదల

17.2009–10లో సవరించిన అంచనాల ప్రకారం స్థిర ధరల వద్ద జీడీపీ (ఫ్యాక్టర్ కాస్ట్) వృద్ధి?

ఎ) 7.2 శాతం బి) 7.4 శాతం

సి) 7.6 శాతం డి) 7.8 శాతం

18.మనదేశంలో 2009–10లో అధిక సంపద కలిగిన వ్యక్తుల శాతం మొత్తం జనాభాలో..?

ఎ) 1 బి) 2 సి) 0.02 డి) 0.01

సమాధానాలు

1	బి	2	సి	3	డి	4	సి
5	సి	6	బి	7	సి	8	బి
9	ఎ	10	బి	11	సి	12	ఎ
13	డి	14	ఎ	15	బి	16	ఎ
17	బి	18	డి				